MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

# మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక




ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 5 | సంచిక : 248 | ఆదివారం 29 జూన్ 2025 | పేజీలు : 4 | వెల : 3/-





# 2029 ఎన్నికలే నా టార్గెట్

**పనితీరు బాగా లేకుంటే గుడ్‌బై చెప్పేస్తా: సీఎం చంద్రబాబు**

**వైకాపా హయాంలో రాష్ట్రం ధ్వంసమైందని**

**ఐదేళ్లపాటు కేంద్ర ప్రభుత్వ పథకాలను పక్కదారి పట్టించారు**

**తెదేపా, జనసేన, భాజపా ఎప్పటికప్పుడు సమన్వయంతో ముందుకెళ్తున్నాయి**

**ప్రజలకు అందుబాటులో ఉండాలి**

**ఆగస్టు 15 నుంచి వాట్సప్ గవర్నెన్స్‌లో 703 సేవలు**

**రాజకీయాల్లోకి ఆర్థిక ఉగ్రవాదులు వస్తున్నారు.. జాగ్రత్త**

**తెదేపా కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో చంద్రబాబు**



**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి**

వైకాపా హయాంలో రాష్ట్రం ధ్వంసమైందని తెదేపా అధినేత, సీఎం చంద్రబాబు అన్నారు. ఐదేళ్లపాటు కేంద్ర ప్రభుత్వ పథకాలను పక్కదారి పట్టించారని విమర్శించారు. తెదేపా, జనసేన, భాజపా ఎప్పటికప్పుడు సమన్వయంతో ముందుకెళుతున్నాయన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లకు ఆయన దిశానిర్దేశం చేశారు. పనితీరు బాగా లేకుంటే గుడ్‌బై చెప్పేస్తానని తేల్చిచెప్పారు. "రాష్ట్ర విభజన వేళ అనేక సమస్యలు వచ్చినా నిలదొక్కుకున్నాం. వైకాపా పాలనతో రాష్ట్రం ధ్వంసమైంది. విధ్వంసం నుంచి వికాసం వైపు రాష్ట్రాన్ని తీసుకెళ్తామని ప్రజలకు చెప్పాం. వారు సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకున్నారు. ఐదేళ్లలో మనం ఏం చేయాలనేదానిపై ఇప్పటికే చర్చించాం. ఇచ్చిన మాట ప్రకారం సుపరిపాలనలో తొలి అడుగు వేశాం. రాష్ట్ర పునర్నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ప్రజల ఆకాంక్షలను మనం నెరవేర్చాలి. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలి.. అది మన బాధ్యత. వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి. భవిష్యత్తులో ఏం చేస్తామో స్పష్టంగా చెప్పాలి. ఎన్నికల్లో దామాషా ప్రకారం అందరికీ న్యాయం చేశాం. సంక్షేమం అంటే ఏంటో చూపించిన పార్టీ మనది. ఆర్థిక సంస్కరణలు అందిపుచ్చుకుని పరిపాలన చేశాం. చేసిన పనిని ప్రజలకు - మిగతా 2లో

కార్యకర్తల కష్టం ఉంది..

# వారికి అన్ని విధాల అండగా ఉండాలి

**మనం అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నట్లే వ్యవహరించాలి**

**151 సీట్లు 11 అయ్యాయంటే వారి అహంకారమే కారణం**

**పద్ధతి ప్రకారం ఇచ్చిన ప్రతి హామీ పూర్తి చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నాం**

**సీనియర్లు పార్టీకి కాపలా కాశారు.**

**సీనియర్ల సహకారంతో యువతకు ఉన్న శక్తిని జోడించాలి**

**పార్టీ కార్యాలయాలు నిర్మించాలి.**

**"సుపరిపాలనలో- తొలి అడుగు" కార్యక్రమాన్ని ఇంటింటికీ తీసుకెళ్లి విజయవంతం చేయాలి**

**టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో మంత్రి నారా లోకేష్ పిలుపు**



**అంకుశం ప్రతినిధి అమరావతి జూన్ 29**

మంగళగిరిః "సుపరిపాలనలో- తొలి అడుగు" కార్యక్రమాన్ని నెల రోజుల పాటు ఇంటింటికీ తీసుకెళ్లి విజయవంతం చేయాలని విద్య, ఐటీ శాఖల మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం, పార్టీ సంస్థాగత నిర్మాణంపై చర్చించేందుకు మంగళగిరిలోని జాతీయ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన టీడీపీ విస్తృత స్థాయి సమావేశంలో మంత్రి లోకేష్ ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 2024 ఎన్నికల్లో మనం ఊహించని విధంగా 94 శాతం సీట్లను ప్రజలు గెలిపించారు. దీనికి ప్రధాన కారణం గత పాలకులకు ఉన్న అహంకారం, వారి పని విధానం. అందుకే మనల్ని పెద్దఎత్తున ఆశీర్వదించారు, దీవించారు, గెలిపించారు. ఈ గెలుపు వెనుక కార్యకర్తల కష్టం చాలా ఉంది. నేను యువగళం పాదయాత్ర ప్రారభించినప్పుడు %జఖదీ%- కబ్ సిస్టమ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు మన నాయకుడు చంద్రబాబు చెప్పారు. ఇప్పటికే గ్రామ పార్టీ ఉందని, ఫలితం ఉండదని నేను చెప్పాను. చేసి చూపిస్తామని, దాని వల్ల ఎలాంటి ఫలితాలు వస్తాయో కూడా చూస్తారని ఆనాడు చెప్పడం - మిగతా 2లో

# అమాత్యా మేలుకో.. పప్పూ నిద్ర వదులు

- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి..
- ఏపీ విద్యావ్యవస్థలో నెలకొన్న దారుణ పరిస్థితులకు మరో నిదర్శనం
- 'రాష్ట్రంలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందనడానికి ఏపీఈసెట్ అడ్మిషన్లే పెద్ద ఉదాహరణ
- ఈసెట్ రిజల్ట్స్ వచ్చి దాదాపు 45 రోజులు అవుతున్నా ఇప్పటికీ కౌన్సిలింగ్ ప్రారంభం కాలేదు.



# కరేడు గ్రామ ప్రజలపై పోలీసుల నిర్బంధాన్ని ఖండిస్తున్నాం.

**- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ.**

**అంకుశం న్యూస్ విజయవాడ జూన్ 29**

నెల్లూరు జిల్లా, ఉలవపాడు మండలం కరేడు గ్రామంలో బలవంతపు సేకరణను వ్యతిరేకిస్తూ శాంతియుతంగా నిరసన తెలిపిన కరేడు గ్రామ ప్రజలపై పోలీసుల నిర్బంధం, అరెస్టులను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ నేడు ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు కె రామకృష్ణ నేడు ఒక ప్రకటన విడుదల చేశారు. నెల్లూరు జిల్లా, ఉలవపాడు మండలం, కరేడు గ్రామంలో షిర్డిసాయి అనుబంధ ఇండోసోల్ కంపెనీకి 8458 ఎకరాల భూమిని అప్పనంగా అప్పగించేందుకు చేస్తున్న భూసేకరణకు వ్యతిరేకంగా, బలవంతపు సేకరణ ఆపాలని డిమాండ్ చేస్తూ భూ పోరాట సాధన కమిటీ ఆధ్వర్యాన శాంతియుతంగా ఆందోళన చేపట్టిన గ్రామ ప్రజలపై పోలీసులు అత్యంత నిర్బంధంగా వ్యవహరించి, అరెస్టులకు పాల్పడటం దుర్మార్గం. నాడు చంద్రబాబు నాయుడు ప్రతిపక్షంలో ఉండగా గత వైసిపి ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలను తప్పుపట్టారు. ఆదాని కంపెనీతో సోలార్ విద్యుత్ ఒప్పందాలను, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, బలవంతపు భూసేకరణ, అధిక ధరలు వంటి వాటిని గతంలో చంద్రబాబు నాయుడు తీవ్రంగా వ్యతిరేకించారు. కానీ ఇప్పుడు అధికారం చేపట్టిన తర్వాత కూటమి ప్రభుత్వం కూడా ఆ అనాలోచిత నిర్ణయాలనే అమలు చేయటం విచారకరం. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు సైతం కరేడు - మిగతా 2లో



# 2029 ఎన్నికలే నా టార్గెట్






-మొదటిపేజీ తరువాయి
చెప్పడం ముఖ్యం. 2014-19 మధ్య చేసిన అభివృద్ధిని చెప్పుకోలేకపోయాం. సుస్థిర పాలన ఉంటేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుంది.

**ఆగస్టు 15 నుంచి వాట్సప్ గవర్నెన్స్‌లో 703 సేవలు**

బ్లాక్ మెయిల్ రాజకీయాలు మనం ఎప్పుడూ చేయం. కేంద్రం మనకు బాగా సాయం చేస్తోంది. సమస్యలన్నీ పరిష్కారం అయ్యాయని చెప్పడం లేదు. ఇంకా చాలా పరిష్కరించాలి.. అదే మన లక్ష్యం. సేవ, పారిశ్రామిక, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యమివ్వాలి. ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్లు పెంచి ఇస్తున్నాం. పంటలకు గిట్టుబాటు ధర ఇచ్చి రైతులను ఆదుకుంటున్నాం. ప్రతి రైతుకూ రూ.20వేల సాయం చేస్తాం. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ప్రారంభిస్తాం. అమరావతి నిర్మాణానికి రూ.15వేల కోట్లు మంజూరు చేశాం. రాజధాని ప్రాంతంలో పనులను పట్టాలెక్కించాం. పోలవరానికి రూ.12,500 కోట్లు కేంద్రం ఇచ్చింది. రాబోయే ఏడాదిన్నరలో ఆ ప్రాజెక్టును పూర్తిచేస్తాం. ఎట్టి పరిస్థితుల్లోనూ 2027 నాటికి జాతికి అంకితం చేస్తాం. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కి రూ.11,400 కోట్లు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. మరో నాలుగైదు నెలల్లో అది లాభాల బాట పడుతుంది. క్రిష్ సిటీలో పనులు ప్రారంభయ్యాయి.

ఐటీ విప్లవాన్ని అందిపుచ్చుకున్నాం. వాట్సప్ గవర్నెన్స్‌తో సుమారు 500 సేవలు ఆన్‌లైన్‌లో అందిస్తున్నాం. ఆగస్టు 15 నాటికి 703 సేవలు ఆన్‌లైన్‌లో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. దీనివల్ల అవినీతి తగ్గుతుంది. ప్రజలకు ఇబ్బందులు లేకుండా పాలన అందించే అవకాశం ఉంటుంది. పాలసీలు ఎంత మంచివైనా అమలు చేయడంలో చిత్తశుద్ధి ఉండాలి. రాష్ట్రానికి అనేక పెద్ద కంపెనీలు వస్తున్నాయి. రాష్ట్రాన్ని 5 జోన్లుగా విభజించి అభివృద్ధి ప్రణాళిక తయారు చేస్తున్నాం. ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి శ్రీకారం చుట్టాం.
రాజకీయాల్లోకి ఆర్థిక ఉగ్రవాదులు వస్తున్నారు.. జాగ్రత్త
భవిష్యత్తుపై ప్రజలకు నమ్మకం కలిగించే బాధ్యత మనపై ఉంది. ప్రజాసేవ చేసే కుటుంబాలను ప్రోత్సహిస్తున్నాం. నిత్యం ప్రజల మధ్య ఉంటేనే సాయం చేయగలం.. లేకుంటే ఏమీ చేయలేం. చిన్నచిన్న పొరపాట్లు ఉంటే సరిదిద్దుకుందాం. మన ప్రవర్తన, అలవాట్లలో తప్పులుంటే మార్చుకుందాం. కొందరు ఎమ్మెల్యేలను పిలిచి వ్యక్తిగతంగా మాట్లాడుతున్నా. మొహమాటం లేదు.. వారి తప్పులు స్పష్టంగా చెబుతున్నా. రాజకీయాల్లోకి ఆర్థిక ఉగ్రవాదులు వస్తున్నారు.. ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. వివేకాను దారుణంగా చంపేసి అంత్యక్రియలు చేసేందుకు సిద్ధమయ్యారు. నిందితులను అప్పుడే అరెస్ట్ చేసుంటే ఫలితాలు మరోలా ఉండేవి. కోడికత్తి, గులకరాయి డ్రామాలు చూశాం. ఎక్కడ ఏ చిన్న ఘటన జరిగినా రాజకీయాలు చేస్తున్నారు. గంజాయి బ్యాచ్, రౌడీషీటర్లను ఎవరైనా పరామర్శిస్తారా? జగన్ సత్తెనపల్లి పర్యటనలో కారు కింద వ్యక్తి పడినా కనీసం పట్టించుకోలేదు. తప్పులు చేస్తే ఆధారాలు చూపిస్తాం.. కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రజలకు భద్రత కల్పించడమే మన ప్రథమ కర్తవ్యం.
2029 ఎన్నికలే నా టార్గెట్
రోడ్డు ప్రమాదంలో పాస్టర్ చనిపోతే మనమే కారణమన్నారు. నిజం గడప దాటేసరికి అబద్ధం ఊరంతా చుట్టి వస్తుందని గ్రహించాలి. ప్రజలకు వాస్తవాలు చెప్పడంతో నేతలంతా ముందుండాలి. సోషల్ మీడియా యుగంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. అక్కడ దారుణంగా వ్యక్తిత్వ హననం చేస్తున్నారు. 2029 ఎన్నికలే నా టార్గెట్. పనితీరు బాగా లేకుంటే మొహమాటం లేకుండా గుడ్‌బై చెప్పేస్తా. వచ్చే ఎన్నికల్లో గెలిచేందుకు కౌంట్‌డౌన్ పెట్టుకుని పనిచేస్తున్నాం. ఏళ్లు.. నెలలు.. రోజులు.. గంటలు కూడా లెక్కిస్తున్నా. తానా, ఆటా అంటూ ఫారెన్ ట్రిప్పులు వద్దు. అలా వెళ్తే టాటా చెప్పేస్తా. ప్రజాప్రతినిధుల గ్రాఫ్ పెరుగుతుందా? తగ్గుతుందా? పరిశీలిస్తున్నా. మొదటి ఏడాది పాలన పూర్తయింది.. రెండో ఏడాది ప్రారంభైంది. నెల రోజులపాటు ప్రతి గడపకూ నేతలు వెళ్లాలి" అని చంద్రబాబు స్పష్టం చేశారు.

# కార్యకర్తల కష్టం ఉంది, వారికి అన్ని విధాల అండగా ఉండాలి

-మొదటిపేజీ తరువాయి
జరిగింది. క్లస్టర్, యూనిట్, బూత్ వ్యవస్థ వచ్చిన తర్వాతే మన బూత్ లు పటిష్టం అయ్యాయి. అనేక కార్యక్రమాలు మన చేయగలుగుతున్నాం. దీనిని మనం గుర్తు పెట్టుకోవాలి.

**151 సీట్లు 11 అయ్యాయంటే దానికి కారణం వారి అహంకారం**

గడిచిన ఐదేళ్ళలో ఇక్కడ ఉన్న నేతలందరిపైనా అప్పటి పాలకపక్షం కేసులు పెట్టింది. శనివారం వస్తే ఎవరి గోడ పగలకొడతారో, ఎవరి ఇల్లు కూల్చుతారో, ఎవరిని జైలుకు తీసుకెళతారో తెలియని పరిస్థితి. ఇవాళ సెల్యూట్ కొట్టే పోలీసులే మనం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కేసులు పెట్టారు. ఇబ్బంది పెట్టారు. మన దేవాలయం లాంటి పార్టీ కార్యాలయంపై దాడిచేస్తే పట్టించుకోని పరిస్థితి. మనం అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నట్లే వ్యవహరించాలి. సమస్యలు ఏమైనా ఉంటే పరిష్కరించాలి. మొన్న ప్రకాశం జిల్లాలో వీరయ్య చౌదరి కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్లినప్పుడు పొగాకు రైతుల సమస్య ఉందని తెలుసుకున్నా. వెంటనే ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు గారితో పాటు వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు గారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాం. ప్రజల్లో ఉంటూ వారి సమస్యలు తెలుసుకోవాలి. వాటిని పరిష్కరించేందుకు కష్టపడాలి. ఈ రోజు నేను ఒక్క పెట్టుబడి తీసుకువచ్చేందుకే అహర్నిశలు కష్టపడుతున్నా. మన నియోజకవర్గ పనికోసం ఇంకెంత కష్టపడాలి? మంచి పనులు చేయాల్సిన బాధ్యత మనపై ఉంది. 151 సీట్లు 11 అయ్యాయంటే దానికి కారణం వారి అహంకారం. దీనిని అందరూ గుర్తుపెట్టుకోవాలి.

**పద్ధతి ప్రకారం ఇచ్చిన ప్రతి హామీ పూర్తి చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నాం**

సుపరిపాలనలో తొలి అడుగు వేశాం. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా కూడా తల్లికి వందనం అమలు చేశాం. దేశంలో ఎక్కడా లేని విధంగా పెన్షన్లు ఇస్తున్నాం. ఒకటో తేదీనే జీతాలు ఇస్తున్నాం. అన్నా క్యాంటీన్లు ప్రారంభించాం. ఆర్థిక వనరులు సమకూర్చుకుని, అహర్నిశలు కష్టపడి అద్భుతమైన కార్యక్రమాలు చేస్తున్నాం. అన్నీ చేశామని చెప్పడం లేదు. ప్రజల వద్దకు వెళ్లి కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించాలి. పద్ధతి ప్రకారం ఇచ్చిన ప్రతి హామీ పూర్తి చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నాం.

**కష్టపడిన కార్యకర్తలను మరువద్దని మిమ్మల్నందరినీ కోరుతున్నా**

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం, సంస్థాగత నిర్మాణంపై చర్చించేందుకు ఇక్కడ సమావేశమయ్యాం. 164 మంది ఎమ్మెల్యేల్లో 88 మంది మొదటిసారి గెలిచినవారు ఉన్నారు. మంత్రివర్గంలో ఉన్న 25 మందిలో 17 మంది మొదటిసారి గెలిచినవారు ఉన్నారు. ఇక్కడ ఉన్న వారిలో చాలా మంది ప్రతిపక్షంలో ఉండగా వేధింపులకు గురైనవారు ఉన్నారు. జైలుకు వెళ్లిన వారు ఉన్నారు. అక్రమ కేసులు నమోదైన వారు ఉన్నారు. కష్టపడిన కార్యకర్తలను మరువద్దని మిమ్మల్నందరినీ కోరుతున్నా. వారిని విస్మరించకుండా ఉండేందుకే పరిశీలకులను వేయడం జరిగింది. మంగళగిరి నియోజకవర్గంలో నియమించిన పరిశీలకుడిని పూర్తి స్థాయిలో వినియోగించుకుంటున్నా.




**ప్రపంచం మొత్తం తిరిగినా వచ్చేది పవిత్ర దేవాలయంలా భావించే పార్టీ కార్యాలయానికే**

పార్టీనే సుప్రీం. దేశం మొత్తం తిరిగినా, ప్రపంచం మొత్తం తిరిగినా తిరిగి వచ్చేది పవిత్ర దేవాలయంలా భావించే పార్టీ కార్యాలయానికే. అందుకే ప్రతి జిల్లాలో, నియోజకవర్గంలో పార్టీ కార్యాలయం నిర్మించాలని చెప్పడం జరిగింది. దేశ స్థాయిలో బీజేపీకి తప్ప ఇంత పెద్ద కార్యాలయం మరే పార్టీకి లేదు. ఒక వ్యవస్థ మనం. ఎవరూ శాశ్వతం కాదు. మనం ఎక్కడ కూర్చోవాలే ప్రజలే నిర్ణయిస్తారు. పార్టీ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమాన్ని సీరియస్ గా తీసుకోవాలి. ఇది చంద్రబాబు గారి ఆదేశాలు. ఏడాది హనీమూన్ అయిపోయింది.

**పార్టీ వ్యవస్థలో మహిళలను పెద్దఎత్తున భాగస్వాములను చేస్తాం**

మహిళలను ప్రోత్సహించేందుకు కబ్స్ లో కో కన్వీనర్ పదవి తీసుకువచ్చాం. పార్టీ వ్యవస్థలో మహిళలను పెద్దఎత్తున భాగస్వాములను చేస్తాం. కమిటీలు వేసేముందు స్థానిక నాయకత్వంతో మాట్లాడాలి. కేఎస్ఎస్ లు 90 శాతం పూర్తి చేశాం. బూత్ లు 82, యూనిట్ లు 80 శాతం, క్లస్టర్ 80శాతం పూర్తి చేయడం జరిగింది. అనుబంధ విభాగాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. ఆయా కమిటీల్లో పనిచేసే వారికి ప్రాధాన్యత ఇవ్వాలి. జులై 5 నాటికి కమిటీలన్నింటిని పూర్తి చేయాలి. పరిశీలకులకు కూడా బాధ్యత ఉంది. కుప్పంలో సంస్థాగత నిర్మాణం వల్లే చంద్రబాబు గారు వరుసగా విజయం సాధిస్తున్నారు. కచ్చితంగా పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి సారించాలి. క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీల్లో యువతకు ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది.

**సీనియర్లకు ఉన్న అనుభవం, యువతకు ఉన్న శక్తి రెండింటినీ జోడించాల్సిన అవసరం ఉంది**

సీనియర్లకు ఉన్న అనుభవం, యువతకు ఉన్న శక్తి రెండింటినీ జోడించాల్సిన అవసరం ఉంది. సీనియర్లే పార్టీకి కాపలా కాశారు. వారే పార్టీకి అండగా నిలబడ్డారు. నాలుగు దశాబ్దాలు పార్టీని ముందుకు తీసుకెళ్లారు. దీనిని మనం మర్చిపోకూడదు. పార్టీ పదవుల విషయంలో దామాషా ప్రకారం పదవులు ఇవ్వాలి. అందరినీ కలుపుకుని పోవాలి. నియోజకవర్గంలో పార్టీ సంస్థాగత నిర్మాణం బాగా చేసిన వారిలో మంత్రి నిమ్మల రామానాయుడు గారు నెం.1గా ఉన్నారు. మంగళగిరి ఐదో స్థానంలో ఉంది. మనలో పోటీతత్వం రావాలి. బాగా కష్టపడాలి. బాగా పనిచేసిన కార్యకర్తలను సాంకేతిక పరిజ్ఞానం సాయంతో గుర్తించాలి. నా నియోజకవర్గ పర్యటనల్లో ముందుగా బాగా పనిచేసిన కార్యకర్తలను సత్కరించడం జరుగుతోంది.

**సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఇంటింటికీ తీసుకెళ్లాలి**

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఇంటింటికీ తీసుకెళ్లాలి. కుటుంబ సాధికార సారథి నుంచి పొలిట్ బ్యూరో సభ్యుల వరకు అందరం రోడ్డెక్కాలి. అందరం పాల్గొనాలి. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలి. డోర్ టూ డోర్ వెళ్లినప్పుడు ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ ను యాప్ లో నమోదు చేయాలి. మై టీడీపీ యాప్ ద్వారా మీరు చేసిన పనులు పార్టీకి తెలియజేయాలి. నెల రోజుల పాటు తూచా తప్పకుండా అందరం డోర్ టూ డోర్ ప్రచారం చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు మంత్రులు అచ్చం నాయుడు పయ్యావుల కేశవ్ కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు హోం మంత్రి అనిత పార్టీ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి మాగంట శ్రీనివాసులు రెడ్డి కొల్లు రవీందర్ సవితమ్మ రాంప్రసాద్ రెడ్డి విప్ కాలువ శ్రీనివాసులు పార్లమెంట్ సభ్యులు పార్థసారథి చిన్నరాజప్ప పార్టీ అధ్యక్షుడు పళ్ళ దేవినేని ఉమా మంత్రి శ్రీనివాస్ బైరెడ్డి శబరి ఇతర ప్రజాప్రతినిధులు శాసనసభ్యులు నామినేటెడ్ చైర్మన్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు వారందరికీ సీఎం చంద్రబాబు నాయుడు నారా లోకేష్ పలు సూచనలు చేశారు

## డైట్ ఛార్జీల పెంపునకు కృషి

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
వర్షాకాలం నేపథ్యంలో అప్రమత్తంగా ఉండండి
హాస్టల్ విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపండి
బీసీ హాస్టల్ వార్డెన్లతో మంత్రి సవిత




**అంకుశం ప్రతినిధి అమరావతి 29 :** హాస్టల్ విద్యార్థులకు ఇచ్చే డైట్ ఛార్జీల పెంపునకు కృషి చేస్తానని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి సవిత తెలిపారు. ప్రస్తుత వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని, తాజా ఆహారాన్ని మాత్రమే అందించాలని స్పష్టంచేశారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి సవితను రాష్ట్ర బీసీ వసతి గృహ సంక్షేమాధికారుల సంఘ ప్రతినిధులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ, మంత్రిని వారు ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైందని, ఇప్పటికే ప్రభుత్వం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర కిట్లు, పాఠ్య పుస్తకాలను పంపిణీ చేసిందని తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని, తాజా ఆహారం, మరిగించి చల్లార్చిన నీరు మాత్రమే అందించాలని స్పష్టంచేశారు. విద్యార్థులకు జలుబు, తలనొప్పి, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే, తక్షణమే అందుబాటులో ఉన్న వైద్యులతో వైద్య సేవలందించాలన్నారు.

**సమస్యల పరిష్కారానికి కృషి**

హాస్టళ్లలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి సవిత హామీ ఇచ్చారు. డైట్ ఛార్జీల పెంపు విషయమై ఇప్పటికే సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లామన్నారు. బీసీ హాస్టళ్లకు మాత్రమే కాకుండా సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల హాస్టళ్లకు సంబంధించి డైట్ ఛార్జీలపైనా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. త్వరలోనే డైట్ ఛార్జీల పెంపు విషయమై నిర్ణయం వెలువడే అవకాశముందన్నారు. నాలుగో తరగతి ఉద్యోగాలు, హెచ్ డబ్ల్యూవోల ఖాళీ పోస్టుల భర్తీ, ఏబీసీ డబ్ల్యూవోల పదోన్నతల అంశాలను కూడా సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళతానన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా హాస్టళ్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిధులు కేటాయిస్తూ, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందని తెలిపారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మంత్రి సవితకు రాష్ట్ర బీసీ వసతి గృహ సంక్షేమాధికారుల సంఘ ప్రతినిధులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ వసతి గృహ సంక్షేమాధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మస్తాన్, గౌరవ అధ్యక్షులు దయానంద్ రాజు, రాష్ట్ర అసోయేషిట్ ప్రెసిడెంట్ రాజోలు శ్రీను, సాగర్ బాబు సహా వివిధ జిల్లా అధ్యక్షులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అమాత్యా మేలుకో.. పప్పూ నిద్ర వదులు: వైఎస్ జగన్

**తాడేపల్లి:** ఏపీ ఈసెట్ రిజల్ట్స్ వచ్చి 45 రోజులవుతున్నా ఇంకా కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభం కాకపోవడంపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. చంద్రబాబు సర్కారును నిలదీశారు ఇది ఏపీ విద్యావ్యవస్థలో నెలకొన్న దారుణ పరిస్థితులకు మరో నిదర్శనమంటూ వైఎస్ జగన్ ధ్వజమెత్తారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు వైఎస్ జగన్. 'రాష్ట్రంలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందనడానికి ఏపీఈసెట్ అడ్మిషన్లే పెద్ద ఉదాహరణ. ఈసెట్ రిజల్ట్స్ వచ్చి దాదాపు 45 రోజులు అవుతున్నా ఇప్పటికీ కౌన్సిలింగ్ ప్రారంభం కాలేదు. మరోవైపు రేపటి నుంచి ఇంజనీరింగ్ విద్యార్థులకు క్లాసులు ప్రారంభం అవుతున్నాయి. ఇంజనీరింగ్ రెండో ఏడాదిలో అడ్మిషన్లకోసం 34వేల మంది పాలిటెక్నిక్ విద్యార్థులు ఈసెట్ పరీక్షలు రాస్తే అందులో 31,922 మంది ఉత్తీర్ణత సాధించారు. గతనెల మే 15న ఫలితాలు వెలువడినా, ఇప్పటికీ కౌన్సెలింగ్ ప్రక్రియపై షెడ్యూల్ విడుదలచేయకపోవడం, ఆ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కాకపోవడం, విద్యావ్యవస్థలో నెలకొన్న దారుణ పరిస్థితులకు మరో నిదర్శనం. అమాత్యా మేలుకో.. పప్పూ నిద్ర వదులు' అంటూ విమర్శించారు.

## కరేడు గ్రామ ప్రజలపై పోలీసుల నిర్బంధాన్ని ఖండిస్తున్నాం.

-మొదటిపేజీ తరువాయి
గ్రామ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ నిర్బంధకాండ కొనసాగించటం దారుణం. రాష్ట్ర ప్రభుత్వం పోలీసుల్ని ప్రయోగించి రైతులు, గిరిజనులు, మహిళలను అక్రమంగా అరెస్టులకు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. కరేడు గ్రామ ప్రజల ఆందోళనకు మద్దతు తెలిపేందుకు వెళ్లిన ఏఐసిసి సభ్యురాలు సుంకర పద్మశ్రీ పట్ల దురుసుగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాం.ఇండోసోల్ కంపెనీ కోసం రాష్ట్ర ప్రభుత్వం బలవంతపు భూసేకరణ ఆపాలని, ప్రజలపై నిర్బంధ కాండను ప్రయోగించిన పోలీసులపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం.

## స్థానిక సంస్థల హక్కులను అధికారాలు తొలగిస్తున్న ప్రభుత్వం

హర్యానాలో జరిగే సదస్సుకు వైయస్సార్సీపి మేయర్లు, చైర్మన్లు లేకుండా కుట్ర
అనంతపురం నగర మేయర్ మహమ్మద్ వసీం

**అంకుశం న్యూస్ అనంతపురం: జూన్ 29:** కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థలు, ప్రజాప్రతినిధుల హక్కులను కాలరాస్తుందని అనంతపురం మేయర్ మహమ్మద్ వసీమ్ ధ్వజమెత్తారు. ఆదివారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసినటువంటి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జులై 3, 4 తేదీల్లో హర్యానాలోని గురు గ్రామ్ లో " రాజ్యాంగ ప్రజాస్వామ్యం మరియు జాతి నిర్మాణంలో పట్టణ స్థానిక సంస్థల పాత్ర " అనే అంశం మీద రెండు రోజులపాటు జాతీయ సదస్సు కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలోని మేయర్లు,చైర్మన్లు, డిప్యూటీ మేయర్లు, డిప్యూటీ చైర్మన్లు కు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వము నిర్ణయిస్తేచంద్రబాబు సర్కార్ మాత్రం వైయస్సార్సీపీ మేయర్లు, డిప్యూటీ మేయర్లు,డిప్యూటీ చైర్మన్లు కు అవకాశం ఇవ్వకుండా కూటమి ప్రభుత్వంకు చెందిన వారికి మాత్రమే ఇవ్వడం దారుణం అన్నారు.వైఎస్సార్ సీపీ మేయర్లు, మున్సిపల్ చైర్మన్లను పక్కనపెట్టడంపై అనంతపురం మేయర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన ఏకపక్షంగా ఉంది అనడానికి ఇంతకంటే నిదర్శనం ఏమి కావాలని ప్రశ్నించారు.నలభై ఏళ్ళ రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు నాయుడు కు ప్రతిపక్ష పార్టీ లకు చెందిన ప్రజాప్రతినిధులను గౌరవించటం తెలియలేదా? అని మేయర్ నిలదీశారు.కూటమి ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోంది అనడానికి ఇంతకంటే ఇంకా ఏమి నిదర్శనం కావాలన్నారు.

# నేషనల్ యోగా కాంపిటీషన్స్ కి పూర్తి సహకారం అందిస్తాను





**ఎంపీ కేశినేని శివనాథ్**

**ఎంపీ కేశినేని చిన్నిను కలుసుకున్న యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సభ్యులు**

**యోగాసన అథ్లేట్స్ ను సన్మానించి ఎంపీ కేశినేని చిన్ని**

**యోగా ఆర్టిస్టిక్ పెయిర్ ప్రదర్శన తో అలరించిన అథ్లేట్స్**

**అంకుశం ప్రతినిధి విజయవాడ, జూన్ 29:** ఆంధ్రప్రదేశ్ ను యోగాంధ్రప్రదేశ్ గా చేసేందుకు సహకరించిన యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సభ్యులకు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అభినందించారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో ఆదివారం యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో యోగాసన అథ్లేట్స్ ఎంపీ కేశినేని శివనాథ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. జూన్ 21వ తేదీ వైజాగ్ లో జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న యోగాసన అథ్లేట్స్ పి.వెంకట త్రివేణి, పి.బార్గవి, ఎమ్.అక్షయ్, బి.అనూష, ఎ.పూజిత ల ను, న్యూఢిల్లీ లో ఏప్రిల్ 25 నుంచి 27 వరకు జరిగిన 2వ ఏషియన్ యోగాసన స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్ లో గోల్డ్ మోడల్స్ సాధించిన బి.కె. రాములు, బి.శిరీష, కావ్యశ్రీ, డి.ధీరజ్ కృష్ణ లను ఎంపీ కేశినేని శివనాథ్ ప్రత్యేకంగా అభినందించి శాలువాలతో సత్కరించారు.ఈ సందర్భంగా యోగా అథ్లేట్స్ మనోహర్, గణేష్ ప్రదర్శించిన ఆర్టిస్టిక్ యోగా ప్రదర్శన ఎంపీ కేశినేని శివనాథ్ ఆసక్తి గా తిలకించారు. ఈ సందర్భంగా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సభ్యులు అక్టోబర్ విజయవాడలో నేషనల్ యోగా కాంపిటీషన్స్ నిర్వహించబోతున్నట్లు తెలపగా, అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. యోగా లో మంచి ప్రతిభ కనబర్చిన చిన్నారులకు విద్యతో పాటు యోగా లో కూడా మరింత రాణించాలని ఆకాంక్షించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తో కలిసి యోగా చేయటం చిన్నారులకు లభించిన గొప్ప అవకాశం. ఆ స్పూర్తితో భవిష్యత్తులో రాణించే విధంగా కెరియర్ ను తీర్చిదిద్దుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రెసిడెంట్ ఎ.రాధిక, గౌరవ అధ్యక్షుడు కొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్, కార్యదర్శి పర్వతనేని ప్రేమకుమార్, ఉపాధ్యక్షుడు ఎమ్.రాజశేఖర్ రెడ్డి, సభ్యులు ఎస్.రాజేశ్వరి, దుర్గారావు, ఎస్.నాయుడు, సి.హెచ్. దాసయ్య లతో తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 3 న జరిగే బహుజనుల

# ప్రజాప్రతినిధుల ఆత్మీయ సన్మాన కార్యక్రమం

**డా. పోతుల నాగరాజు, వ్యవస్థాపకులు రిజర్వేషన్ల పరిరక్షణ సమితి**



**అంకుశం న్యూస్ అనంతపురం జూన్ 29:** అనంతపురం జిల్లా కేంద్రం లో ఆగస్టు 3 వ తేదీన జరిగే బహుజన ప్రజాప్రతినిధుల ఆత్మీయ సన్మాన కార్యక్రమంను జయప్రదం చేయాలనే, కార్యక్రమంలో భాగంగా విజయవాడ కేంద్రంలో మహనీయులు మహాత్మా జ్యోతిరావు పూలే గారు మరియు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి కి నివాళులర్పిస్తూ కరపత్రం విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా రిజర్వేషన్ల పరిరక్షణ సమితి (%ాూా%) వ్యవస్థాపకులు, డా. పోతుల నాగరాజు మాట్లాడుతూ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రకారం దేశంలో జనాభా దామాషా ప్రకారం అన్ని రంగాలలో సమాన వాటా కోసం బహుజనులు ఉద్యమం చేయాలని,పిలుపు నిస్తూ, 56% శాతం ఉన్న %దీజ% లకు చట్ట సభ లలో రిజర్వేషన్ కల్పించాలని, విద్య ఉద్యోగాలలో, స్థానిక సంస్థల లో కూడా 44% శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూ, ఈ డిమాండ్ కు రాజకీయ పార్టీ లు, బహుజన ప్రజాప్రతినిధులు మద్దతుగా నిలవాలని, అభ్యర్థిస్తూ, దళిత, గిరిజన రిజర్వేషన్ వారి ధామాషా ప్రకారం పెంచాలని, అత్యున్నత న్యాయస్థానాలలో రిజర్వేషన్లు అమలు చేయాలని, అత్యున్నత విద్యాసంస్థల్లో రిజర్వేషన్లను రద్దు చేయడం జరిగింది . వాటిని వెంటనే అమలు చేయాలి. కేంద్ర ప్రభుత్వం ప్రవేటికరణను ఆపాలని, కాంట్రాక్ట్ ,అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేయుచున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బ్యాక్లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, డిమాండ్ చేస్తూ,2027లో జరిగే జనాభా లెక్కలలో కులాల వారీగా జనాభా లెక్కలు చేపట్టాలని కేంద్ర క్యాబినెట్ తీసుకోన్న నిర్ణయం ను స్వాగతిస్తూ, ఈ డిమాండ్ కు మద్దతుగా నిలిచిన ఉద్యమ నాయకులను, బహుజన ప్రజాప్రతినిధులను, రాజకీయ పార్టీ ల అధ్యక్షులను అభినందించాలని నిర్ణయం తీసుకొని ఈ కార్యక్రమంను జయప్రదం చేయాలని పిలుపు నివ్వడం జరుగుతుంది.ఈ కార్యక్రమంలో ఆర్పిఎస్ జాతీయ నాయకులు శివరాం యాదవ్, రైల్వే ఓబీసీ ఉద్యోగుల నాయకులు సత్యనారాయణ, ప్రసాద్, శ్రీనివాసులు, REF రాష్ట్ర కో కన్వీనర్ హరి వర్మ, మావటి శ్రీరాములు, తిరుపతి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# కూటమి మోసాలపై ప్రజలకు వివరించాలి

**ఇచ్చిన హామీలను ఏ విధంగా మోసం చేశారో జనంకు చెప్పాలి**

**నంద్యాల జిల్లా వై ఎస్సారాపార్టీ విస్తృత స్థాయి సమావేశం...**


**పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాజీమంత్రి పిలుపు**







**అంకుశం న్యూస్ నంద్యాల్ జూన్ 29 :**దేశం పార్టీ ఎన్నికల హామీలు మోసంపై ప్రజల్లో చేతనవంతం చేయాలని చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించి ముందుకెళ్లాలని పార్టీలోనే అందరూ ఐకమత్యంగా కదలాలని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నంద్యాలలో ఆదివారం జిల్లా వైఎస్సార్సీపీ విస్తృత స్థాయి సమావేశం రీజనల్ కోఆర్డినేటర్ మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ముందుగా ఏర్పాటు చేసిన దివంగత ముఖ్య మంత్రి డా.వై ఎస్సార్ విగ్రహానికి పూలమాలను సమర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం ప్రజల ముందుకు తీసువచ్చిన ఉమ్మడి మేనిఫెస్టో 2024లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేసి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వ విధానాలను ప్రజలకు తెలియజేసే భాగంగా నేడు రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో అనే కార్యక్రమాన్ని నాయకులు ప్రారంభించడం జరిగింది. వైఎస్సార్ సీపీ నాయకులు జిల్లా స్థాయి, నియోజకవర్గ స్థాయి, మండల స్థాయి మరియు గ్రామస్థాయిలో ప్రజల వద్ద వెళ్లి కూటమి ప్రభుత్వం, చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేకపోవడం వల ప్రజలకు కలిగిన నష్టాలను వివరించాలని రీజనల్ కోఆర్డినేటర్ మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి వైఎస్సార్సీపీ నాయకులు విస్తృతస్థాయిలో ప్రచారం చేసి ప్రజలను మోసం చేసిన కూటమి నాయకుల తీరును ఎండగట్టాలని, 2027లో జరుగనున్న జమిలీ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రీజనల్ కోఆర్డినేటర్ మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ...కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా విడుదల చేసిన మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను ఎండగట్టే కార్యక్రమంలో భాగంగా రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో- 2024, బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. జిల్లా, నియోజకవర్గం, మండలం, గ్రామీణ స్థాయిలోకి వైఎస్సార్సీపీ నాయకులు వెళ్లి చంద్రబాబు ఇచ్చిన మేనిఫెస్టోలో చెప్పిన హామీలను నెరవేర్చలేక పోవడం వల్ల ప్రజలకు కలిగిన నష్టాలను తెలియజేయాలన్నారు. నాడు దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ను వెన్నుపోటుపొడిచి అధికారంలోకి వచ్చాడని, అలాగే 2014లో ప్రజలకు బూటకపు హామీలతో, అలాగే 2024లో కూడా తన మాయపు మాటలతో, మోసపు వాగ్దానాలతో ప్రజలకు మోసం చేశారని విమర్శించారు. ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకపోగా ప్రశ్నించిన వైఎస్సార్సీపీ నాయకులను నాలుకమందం అంటూ మాట్లాడటం సరికాదన్నారు. చిత్తశుద్ధిలేని చంద్రబాబు మరియు కూటమి నేతలను ప్రజల ముందు దోషులుగా నిలబెట్టాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది దాటిపోయినా కేవలం పైన్షన్లు, అరకొరగా తల్లికి నందనం అనే పథకాలను మాత్రమే అందించిందని, సూపర్ సిక్స్ పథకాలను అన్నిటినీ అమలు చేయలేదన్నారు. జిల్లా స్థాయి, నియోజకవర్గం, మండల స్థాయి నాయకులు ప్రజల్లోకి వెళ్లి విస్తృతంగా కూటమి ప్రభుత్వం విడుదల చేసిన మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని తెలియజేయాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీలు ఇసాక్ బాష, కల్పలతా రెడ్డి, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు శిల్పా చక్రపాణిరెడ్డి, గంగుల బిజేంద్రారెడ్డి, , మండల స్థాయి నేతలు పాల్గొన్నారు.

## తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణతో కలిసి మండల,గ్రామ కమిటీలు, బూత్ కన్వీనర్స్ నియమించిన మనోజ్



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జూన్ 29:** అనపర్తి మండలం రామవరంలో అనపర్తి నియోజకవర్గం టిడిపి ముఖ్య నాయకులతో మండల,గ్రామ కమిటీలు,బూత్ కన్వీనర్స్, కో- కన్వీనర్స్ నియామకం గురించి సమావేశమై,చర్చించిన అనపర్తి నియోజకవర్గం పరిశీలకులు రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ,యువ నాయకులు నల్లమిల్లి మనోజ్ రెడ్డి. ఈ కార్యక్రమంలో అనపర్తి నియోజకవర్గం టిడిపి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ఎస్వీ విద్యాదాన ట్రస్టుకు రూ.51 లక్షలు విరాళం



**అంకుశం న్యూస్ తిరుమల జూన్ 29:** చెన్నైకు చెందిన టీవీఎస్ క్యాపిటల్ ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ టీటీడీ శ్రీ వేంకటేశ్వర విద్యాదాన ట్రస్టుకు రూ.51 లక్షలు విరాళంగా అందించింది. ఈ విరాళం చెక్కును సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ గోపాల్ శ్రీనివాసన్ శనివారం సాయంత్రం తిరుమలలోని టీటీడీ అదనపు ఈవో సీ.హెచ్.వెంకయ్య చౌదరికి ఆయన క్యాంపు కార్యాలయంలో అందజేశారు.

## సిపిఓ కార్యాలయంలో ఘనంగా 19వ గణాంక దినోత్సవ వేడుకలు



**అంకుశం న్యూస్ అనంతపురం, జూన్ 29 :** అనంతపురం నగరంలోని సిపిఓ కార్యాలయంలో 19వ గణాంక దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. భారత గణాంకాల పితామహుడు, 1వ ప్రణాళికా సంఘం సభ్యుడు, భారత గణాంక సంస్థ వ్యవస్థాపకుడు పిసి.మహల్బంద్ర నోబిస్ జయంతి సందర్భంగా గణాంక దినోత్సవ వేడుకలను నిర్వహించగా, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి సిపిఓ అశోక్ కుమార్, ఎస్ఓ మనోహర్, డిప్యూటీ ఎస్ఓలు సేనా నాయక్, పోతిరెడ్డి, తదితరులు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఓ అశోక్ కుమార్ మాట్లాడుతూ భారత గణాంక సంస్థ వ్యవస్థాపకుడు పిసి.మహల్బంద్ర నోబిస్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఓలు, తదితరులు పాల్గొన్నారు.

## నారా లోకేష్ ను కలిసిన ఎమ్మెల్యే వేగుళ్ళ



**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జూన్ 29:** మంగళగిరి టిడిపి కేంద్ర కార్యాలయంలో ఆదివారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో జరిగిన సుపరిపాలన తొలి అడుగు సమావేశంలో రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మానవ వనరుల అభివృద్ధి, ఐటి ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్, ఆర్.టి.జి శాఖ మంత్రి నారా లోకేష్ ను ఎమ్మెల్యే వేగుళ్ళ కలిసారు.

## రాష్ట్ర ఎస్.సి. కమిషన్ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన మాజీ మంత్రివర్యులు జవహర్ కి సన్మానించి సత్కరించి, శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే నల్లమిల్లి



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జూన్ 29:** ప్రముఖ విద్య వేత్త, ఉద్యమ నేత, నిస్వార్థపరుడు, సామాజిక సేవాతత్పరుడు, మాజీ మంత్రివర్యులు కొత్తపల్లి శామ్యూల్ జవహర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్.సి. కమిషన్ చైర్మన్ గా పదవి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా,రాజమండ్రి, ఆనంద్ రీజెన్సీ, పందిరి హాలులో సన్మాన కార్యక్రమానికి భారీ ర్యాలీగా వెళ్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్.సి. కమిషన్ చైర్మన్ కె.ఎస్. జవహర్ ని కలిసి సత్కరించి,శుభాకాంక్షలు తెలిపిన అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి.

## ఘనంగా బోనాల జాతర ఉత్సవం!



**అంకుశం న్యూస్ ధర్మవరం జూన్ 29:** సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణం 15వ వార్డు లో ఘనంగా జరుగుతున్న బోనాల జాతరలో చేనేత నాయకులు పల్లెం కృష్ణ తదితరులు పాల్గొనడం జరిగింది, ఆయన మాట్లాడుతూ మన వార్డ్ మరియు గ్రామ ప్రజలందరూ సుభిక్షంగా ఆయురారోగ్యాలతో మరియు ఎటువంటి అవాంతరాలు లేకుండా, అందరూ కలిసిమెలిసి ఉండాలని,ఆ దుర్గమ్మ తల్లి చల్లగా కాపాడాలని కోరారు,ఈ ఉత్సవం లో మహిళలు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు.

## బదిలీల ప్రక్రియలో సచివాలయ ఉద్యోగులకు న్యాయం చేకూర్చండి..

**పట్టణ సచివాలయ ఉద్యోగుల సంఘం ఆవేదన.!**



**అంకుశం న్యూస్ ధర్మవరం జూన్ 29:** ఈనెల 28వ తేదీన అనంతపురంజిల్లా లో వార్డు సచివాలయ ఉద్యోగులకు, గ్రామ సచివాలయ ఉద్యోగులకు బదిలీలకు సంబంధించిన ప్రక్రియ జరిగింది అని, అందులో ముఖ్యంగా వార్డు సచివాలయం బదిలీలకు సంబంధించి మాకు అన్యాయం జరిగింది పట్టణ సచివాలయ ఉద్యోగులు వాపోయారు. అనంతరం వారు మాట్లాడుతూ అందులో స్పోవుస్ అనే ఆప్షన్ తప్పుగా వినియోగించడం జరిగింది అని, దానివల్ల దాదాపు వందల సంఖ్యలో తర్వాత ర్యాంకుల్లో ఉన్న ఉద్యోగులు నష్టపోయారు అని తెలిపారు. దీన్ని చాలా తీవ్రంగా ఖండిస్తున్నాము అని తెలిపారు. దానికి సంబంధించి ఆర్డి ఎంఏ పూర్తిస్థాయిలో విచారణ జరిపి న్యాయం చేకూర్చాలని వారి డిమాండ్ చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లా ( అనంతపురం జిల్లా శ్రీ సత్య సాయి జిల్లా ) హెడ్ క్వార్టర్స్ విషయం, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ట్రాన్స్ఫర్ కు సంబంధించి ఒక్క అనంతపురం జిల్లాలోనే జరిగితే, మరి రాష్ట్ర వ్యాప్తంగా ఏవిధంగా జరిగాయో అర్థం అవుతుంది అని ఆవేదన వ్యక్తం చేశారు. అనేకమంది భార్యాభర్త ఇద్దరు 5 సంవత్సరాలు పూర్తి అయిన వాళ్లు కూడా స్పౌస్ పాత స్టేషన్ ప్రాతిపదికన పెడుతున్నారు. %+ూ% ప్రకారం 5 ఏళ్లు నిండిన స్టేషన్ ఆటోమేటిక్ గా ఖాళీగా పరిగణించబడుతుంది అని తెలిపారు. అంతవరకు చేసిన వారు ఏ విధమైన ప్రాధాన్యత క్యాటగిరిలో ఉన్నప్పటికీ పాత స్టేషన్ల వివరాలతో లబ్ధి పొందడానికి అవకాశం లేదు అని స్పష్టం చేశారు. ఇక్కడ భార్య,భర్త ఇద్దరివి కూడా 5 ఏళ్లు నిండినట్లయితే స్పౌస్ పెట్టే అవకాశం అసలే లేదు అని తెలిపారు. కానీ వీళ్ళు తెలివిగా ముందు కౌన్సిలింగ్ వెళ్లే వాళ్ళు ఇద్దరికీ ఐదేళ్లు పూర్తయ్యాయి అనే విషయాన్ని చెప్పకుండా దాచిపెట్టడం సరి అయిన పద్ధతి కాదు అని తెలిపారు. దీనివల్ల ఇతర సచివాలయ ఉద్యోగులు నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుంది అని తెలిపారు. అయితే ప్రయారిటీ కేటగిరిలో ఉద్యోగులను బదిలీలు చేసే క్రమంలో వారు ఏ కేటగిరి లో బదిలీ అవుతున్నారు అన్నది స్పష్టంగా అందరికీ తెలియజేయాలి అని తెలిపారు. నిబంధనను ఉల్లంఘించ రాదని తెలిపారు.సంవత్సరం లోపు భార్యాభర్తలిద్దరూ స్పౌస్ సర్టిఫికేట్ పొందడం ట్రాన్స్ఫర్ గైడ్లెన్స్ కి వ్యతిరేకం అని తెలిపారు. ఈ విషయమై ఉద్యోగులు ఉన్నతాధికారుల ద్వారా విచారణ జయించి మాకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

# రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల అభివృద్ధికి నిధులు కేటాయించండి







**పలువురు మంత్రులను కలిసిన పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్**

**టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో మంత్రులను కలసిన సునీత, శ్రీరామ్**

**మంత్రుల దృష్టికి హంద్రీనీవా, రోడ్లు, ఎంజేపీ పాఠశాల అంశాలు**

**సానుకూలంగా స్పందించిన మంత్రులు**

**అంకుశం న్యూస్ అనంతపురం జూన్ 30:** రాప్తాడు, ధర్మవరం నియోజకర్గాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పెండింగ్ లో ఉన్న పనులకు సంబంధించి ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ పలువురు మంత్రులను కలిసి విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో మంగళగిరి రాష్ట్ర టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన టీడీపీ రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశంలో వారు పాల్గొన్నారు. మంత్రులు, ఎంపీలు, సహచర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులతో కలసి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సునీత, శ్రీరామ్ పలువురు మంత్రులను ప్రత్యేకంగా కలిసి తమ నియోజకవర్గాలకు సంబంధించిన సమస్యలపై చర్చించారు. ననకోట ఎంజేపి గురుకుల పాఠశాలను జూనియర్ కళాశాలగా అప్ గ్రేడ్ కి సంబంధించిన అంశంపై ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, శ్రీ సత్యసాయి జిల్లా ఇన్ ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ తో చర్చించారు. ఇప్పటికే ప్రభుత్వం జూనియర్ కళాశాలగా అప్ గ్రేడ్ కు అమోదం తెలిపిందని.. అయితే ఈ ఏడాది నుంచే తరగతులు ప్రారంభమయ్యేలా చూడాలన్నారు. ప్రస్తుతం ఫైనాన్స్ విభాగంలో ఫైల్ పెండింగ్ లో ఉందన్నారు. దీనిపై వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి క్లియర్ చేస్తామని మంత్రులు హామీ ఇచ్చారు. హంద్రీనీవా లైనింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో చెరువులకు నీరందించే విషయంపై జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుని సునీత, శ్రీరామ్ కలిశారు. ప్రస్తుతం లైనింగ్ పనులు చేస్తున్న సందర్భంగా చెరువులకు నీరు విడుదల చేసేలా తూములు ఏర్పాటు చేస్తున్నారని.. కానీ ఇక్కడ ఒక్క అడుగు డయా పైపులు మాత్రమే వేస్తున్నారన్నారు. కానీ దీని వలన నీరు తక్కువగా వచ్చే అవకాశం ఉందని.. అందుకే ఒకటిన్నర అడుగు లేదా 2అడుగుల డయా పైపులు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశాన్ని అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని రామానాయుడు హామీ ఇచ్చారు. మరోవైపు ఆర్.అండ్.బి శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని కలిసి అనంతపురం-తగరకుంట రోడ్డుకు సంబంధించిన పనుల గురించి చర్చించారు. ఈ మార్గంలో 25.8కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం కోసం 65.10కోట్ల రూపాయలు మంజూరు కాగా వైసీపీ ప్రభుత్వంలో కొంతవరకు మాత్రమే పనులుచేసి పూర్తి చేయకుండా నిలిపివేశారన్నారు. ఈ రోడ్డు సరిగా లేక ప్రజలు, రైతులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు. దీనిపై మంత్రి జనార్ధన్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. వెంటనే అధికారులతో చర్చించి పనులు పూర్తి చేసేలా చూస్తామని హామీ ఇచ్చారు. అలాగే ధర్మవరం నియోజకవర్గంలో పలు పనులకు సంబంధించి కూడా ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ మంత్రులకు పలు విజ్ఞప్తులు చేశారు....

## ఏపీలోని రేషన్ కార్డుదారులకు షాక్.. ఈసారి కూడా కందిపప్పు సరఫరా లేనట్లే!




**అమరావతి :** ఏపీలోని రేషన్ కార్డుదారులకు బ్యాడ్ న్యూస్. వచ్చే నెల జూలై లోనూ రేషన్ కార్డుదారులకు కందిపప్పు అందేలా కనిపించడం లేదు. జులై నెలకు సంబంధించి నిత్యావసరాలు ఇప్పటికే చేరుకోగా ఈసారి కూడా కందిపప్పు సరఫరా లేదని అధికారులు చెప్తున్నారు. 2025 మార్చి నెల నుంచి ఏపీలో కందిపప్పు పంపిణీ ఆగిపోయింది. మార్కెట్లో కిలో కందిపప్పు ధర రూ.120 నుంచి రూ.160 వరకూ పలుకుతోంది. రేషన్ దుకాణాల్లో తక్కువ ధర (రూ.67)కే లభించే కందిపప్పు సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

## వెంగమాంబ అమ్మవారి సన్నిధిలో ఆకుపాటి




**కనిగిరి జూన్ 29 అంకుశం న్యూస్:** నెల్లూరు జిల్లాలో ప్రసిద్ధి చెందిన నర్రవాడ లో వెలసి ఉన్న జగన్మాత శ్రీ శ్రీ శ్రీ వెంగమాంబ అమ్మవారి బ్రహ్మోత్సవాలలో భాగంగా ప్రకాశం జిల్లా ఎంపీటీసీ ల సంఘం అధ్యక్షులు, పామూరు పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు ఆదివారం ఆకుపాటి వెంకటేష్, మిత్ర బృందం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు ఆకుపాటి వెంకటేష్ ను అమ్మవారి పట్టు వస్త్రంతో సత్కరించి, అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆకుపాటి వెంకటేష్ ఈ సంవత్సరం వర్షాలు పుష్కలంగా కురిసి ఈ దేశంలో, ఈ రాష్ట్రంలో రైతులు సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సస్యశ్యామలంగా ఉండాలని, అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.

## రైల్వే ప్రయాణికులకు భోజనపు ప్యాకెట్లు పంపిణీ.. శ్రీ సత్య సాయి సేవ సమితి కన్వీనర్ నామా ప్రసాద్.



**అంకుశం న్యూస్ ధర్మవరం జూన్ 29:** పట్టణంలోని రైల్వే స్టేషన్లో పాడేరు నుంచి పుట్టపర్తి లో సేవ కోసం వెళుతున్న 35 మంది సేవాదళ్ సభ్యులకు పట్టణంలోని శ్రీ సత్య సాయి సేవ సమితి గాంధీనగర్ కన్వీనర్ నామా ప్రసాద్ ఆధ్వర్యంలో భోజనపు ప్యాకెట్లను, వాటర్ ప్యాకెట్లను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా పుట్టపర్తికి వెళ్లే సేవాదళ్ సభ్యులుగాని, భక్తాదులు గాని అవసరమైన సమయానికి తమ సేవా సమితి తరపున ఉపహారం, అల్పాహారం, భోజనము లాంటి కార్యక్రమాలను చేపట్టడం మాకెంతో సంతోషాన్ని ఇచ్చిందని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలను దాతల సహాయ సహకారాలతో నిర్వహిస్తున్నామని, అటువంటి దాతలకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పుట్టపర్తి సత్యసాయి బాబా ఆశీస్సులతో ముందుందు కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని వారు స్పష్టం చేశారు.

# అనంతలో30వ న కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**- : జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి**

**- : జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,**



**అంకుశం న్యూస్ అనంతపురం, జూన్ 29 :** అనంతపురం జిల్లా అనంతపురం నగరం లోఈనెల 30వ తేదీన సోమవారం అనంతపురం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సఅప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

- అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. అలాగే అర్జీల నమోదు మరియు నమోదైన అర్జీల గురించి వాటి యొక్క స్థితి దానికి సంబంధించి సమాచారం ఏమన్నా తెలుసుకోవాలి అన్నప్పుడు 1100 (డబల్ వన్ డబల్ జీరో) కి నేరుగా కాల్ చేయవచ్చని సూచించారు.

## సర్పంచులకు, తల్లికి వందనం పథకాన్ని తక్షణమే వర్తింపజేయాలి.

**వైయస్సార్సీపి రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం ప్రధాన కార్యదర్శి అప్పిరెడ్డి సురేష్ రెడ్డి**



**అంకుశం న్యూస్ ధర్మవరం జూన్ 29:** సర్పంచులకు, అదేవిధంగా తల్లికి వందనం పథకాన్ని తక్షణమే వర్తింపజేయాలని వైఎస్ఆర్సిపి రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం ప్రధాన కార్యదర్శి అప్పిరెడ్డి సురేష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్ఆర్సిపి పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి , రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగ అధ్యక్షులు వెన్నపూస రవీందర్ రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 30వ తేదీన కలెక్టరేట్ ఆఫీసు నందు పంచాయతీ రాజ్ విభాగపు సమస్యల మీద వినతి పత్రం సమర్పించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న అవినీతిపై కేంద్ర ప్రభుత్వం వెంటనే విచారణ చేయించాలని వారు డిమాండ్ చేశారు. ఎన్ఆర్ఈజీఎస్ చట్టం మేరకు ఉపాధి హామీ పనులలో గ్రామ పంచాయితీల ద్వారానే జరిపించాలని, కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లించాలని వారు తెలిపారు. అదేవిధంగా కేంద్రం విడుదల చేసిన 15వ ఫైనాన్స్ కమిషన్ విడుదల చేసిన నిధులను 1,150 కోట్ల సొమ్మును స్థానిక సంస్థలకు తక్షణమే జమ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమస్యలన్నింటిపై పుట్టపర్తి జిల్లా కలెక్టరేట్లో వినతిపత్రం సమర్పిస్తున్నామని కావున గ్రామపంచాయతీ సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పిటిసిలు, ఎంపీపీలు, పార్టీ కార్యకర్, పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

## రాష్ట్ర పునర్నిర్మాణం లక్ష్యంగా చంద్రబాబు అడుగులు



**జులై2 నుంచి ఇంటింటికి వెళ్లి తాము చేసిన అభివృద్ధిని ప్రజలకు చెబుతామన్న ఎమ్మెల్యే**

**తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్**




**అంకుశం న్యూస్ అనంతపురం జూన్ 29:** ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో ఓవైపు సంక్షేమం మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలను చేస్తున్నామని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. మంగళగిరి రాష్ట్ర టిడిపి కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో జరిగిన విస్తృతస్థాయి సమావేశం, సుపరిపాలనలో తొలి అడుగు - ఇంటింటికి కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, సహచర ఎమ్మెల్యేలతో కలిసి పాల్గొన్నారు. జూలై 2 నుంచి చేపట్టబోతున్న ఇంటింటికి ప్రచార కార్యక్రమం గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన సందేశం అందర్నీ ఆలోచింపజేసిందన్నారు. ఖచ్చితంగా తాము చేసిన అభివృద్ధి గురించి అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి ఇంటింటికి వెళ్లి తెలియజేయాల్సిన బాధ్యత మాపై ఉందన్నారు. ఇప్పటికే వైసీపీ నాయకులు అన్ని విధాలుగా దుష్ప్రచారాలు చేస్తూ బురద చల్లే ప్రయత్నం చేస్తోందన్నారు. ప్రభుత్వం ఏడాది కాలంలో సుపరిపాలన అందించామన్న సంతృప్తి మాతోపాటు రాష్ట్ర ప్రజల్లో కూడా ఉందన్నారు. ప్రజలకు ప్రభుత్వంపై మంచి అభిప్రాయం ఉండకూడదన్న ఉద్దేశంతోనే వైసీపీ నాయకులు రీకాలింగ్ మేనిఫెస్టో వంటి కార్యక్రమాలకు తెర లేపారని విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర పునర్నిర్మాణం లక్ష్యంగా పనిచేస్తున్నారని ఇందుకు ప్రజల సహకారం కూడా అవసరమన్నారు. రాష్ట్ర బడ్జెట్ లోటులో ఉన్నప్పటికీ ఇచ్చిన హామీ మేరకు అన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. త్వరలోనే అన్నదాత సుఖీభవ, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకాలను కూడా అమలు చేస్తామన్నారు. జూలై 2 నుంచి ప్రతి కార్యకర్త, నాయకుడు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించాలన్నారు. అలాగే రాబోయే నాలుగేళ్లలో నియోజకవర్గంలో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాల గురించి కూడా ప్రజలకు వివరిస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

## రాష్ట్ర పునర్నిర్మాణం లక్ష్యంగా చంద్రబాబు అడుగులు

**జులై2 నుంచి ఇంటింటికి వెళ్లి తాము చేసిన అభివృద్ధిని ప్రజలకు చెబుతామన్న ఎమ్మెల్యే**

**తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్**





**అంకుశం న్యూస్ అనంతపురం జూన్ 29:** ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో ఓవైపు సంక్షేమం మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలను చేస్తున్నామని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. మంగళగిరి రాష్ట్ర టిడిపి కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో జరిగిన విస్తృతస్థాయి సమావేశం, సుపరిపాలనలో తొలి అడుగు - ఇంటింటికి కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, సహచర ఎమ్మెల్యేలతో కలిసి పాల్గొన్నారు. జూలై 2 నుంచి చేపట్టబోతున్న ఇంటింటికి ప్రచార కార్యక్రమం గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన సందేశం అందర్నీ ఆలోచింపజేసిందన్నారు. ఖచ్చితంగా తాము చేసిన అభివృద్ధి గురించి అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి ఇంటింటికి వెళ్లి తెలియజేయాల్సిన బాధ్యత మాపై ఉందన్నారు. ఇప్పటికే వైసీపీ నాయకులు అన్ని విధాలుగా దుష్ప్రచారాలు చేస్తూ బురద చల్లే ప్రయత్నం చేస్తోందన్నారు. ప్రభుత్వం ఏడాది కాలంలో సుపరిపాలన అందించామన్న సంతృప్తి మాతోపాటు రాష్ట్ర ప్రజల్లో కూడా ఉందన్నారు. ప్రజలకు ప్రభుత్వంపై మంచి అభిప్రాయం ఉండకూడదన్న ఉద్దేశంతోనే వైసీపీ నాయకులు రీకాలింగ్ మేనిఫెస్టో వంటి కార్యక్రమాలకు తెర లేపారని విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర పునర్నిర్మాణం లక్ష్యంగా పనిచేస్తున్నారని ఇందుకు ప్రజల సహకారం కూడా అవసరమన్నారు. రాష్ట్ర బడ్జెట్ లోటులో ఉన్నప్పటికీ ఇచ్చిన హామీ మేరకు అన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. త్వరలోనే అన్నదాత సుఖీభవ, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకాలను కూడా అమలు చేస్తామన్నారు. జూలై 2 నుంచి ప్రతి కార్యకర్త, నాయకుడు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించాలన్నారు. అలాగే రాబోయే నాలుగేళ్లలో నియోజకవర్గంలో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాల గురించి కూడా ప్రజలకు వివరిస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.